భాషువా 118వ జయంతి సందర్భంగా తెలుగు అకాడమీలోని
జాషువా పరిశోధనా కేంద్రం నిర్వహించిన కథల పోటీ - 2013లో
ప్రత్యేక బహుమతి పొందిన కథ.

# గబ్బిలం

ఆండాళ్ళమ్మ మడి కట్టుకుని పూజ చేస్తున్నారు.

ధూపదీప నైవేద్యాలయ్యాక సర్వ దేవుళ్ళనీ ప్రార్థించారు. కొడుకుల్నీ కూతుళ్ళనీ కోడళ్ళనీ అల్లుళ్ళనీ మనవల్నీ మనవరాళ్ళనీ కనిపెట్టుకుని చల్లగా చూడమని విన్నవించారు. తనకు అనాయాసేన మరణం ప్రసాదించమని అర్థించారు.

పిమ్మట తులసిమాల చేతిలోకి తీసుకుని కళ్ళు మూసుకుని 'హరే రామ హరే కృష్ణ....' అంటూ పఠిస్తూ ఒక్కోసారికీ ఒక్కో పూస చొప్పున లెక్కించసాగారు.

ఆవిడ మనో నేత్రం ముందు ఉత్తుంగమహోన్నత హిమవన్నగాలు వెండికొండల్లా మెరిసిపోతూ దర్శనమిస్తున్నాయి. వాటి మీద ఒక ప్రక్క శివుడు ఆనంద తాండవం చేస్తోంటే మరో ప్రక్క కేశవుడు వెన్నెల వెలుగై ఆనంద స్వరూపమై తిలకిస్తున్నాడు.

మనస్సు దూది పింజె అయి తేలిపోతోంటే అలౌకికానందానుభూతిలో నిలువునా తడిసిపోయారు.

మాలలోని పూసలు పూర్తయ్యాయి.

కళ్ళు తెరిచారు. ఇహానికొచ్చారు. ఆ అద్భుత దృశ్యమాలిక అదృశ్యమయ్యేసరికి అనంతమైన నిరాశ ఆమె కళ్ళల్లో మిల మిలలాడింది. చిన్నగా నిట్టూర్చారు.

'ఆ దివ్య ధామాన్ని చూడటానికి నా కళ్ళు పుణ్యం చేసుకున్నాయో లేదో! ఈ జన్మలో శివకేశవుల విశ్వరూప దర్శన భాగ్యం వుందో లేదో!'

మళ్ళీ నిట్టూర్చారు. పెరట్లోకెళ్ళి సూర్యనారాయణుడికి నమస్కరించి వచ్చి ఇన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకున్నారు.

'పిల్లలెవరూ ఫోన్ చెయ్యనేలేదు సుమా' అనుకున్నారు. ఆ వెంటనే, 'పొద్దుటే ఎక్కడ కుదుర్తుందిలే' అని తనకు తనే సమాధానం చెప్పుకున్నారు.

వంట ఏర్పాట్లలో ఉండగా "అమ్మగోరూ" అంటూ వీధిలోంచి పిలిచారెవరో.

"వస్తున్నా" తెల్లచీర కొంగు తలమీదకు లాక్కుని "ఎవరూ" అంటూ వీధి అరుగు మీదకెళ్ళారు.

దావీదూ ఓ యువకుడూ ఇంటిముందు నిలబడి ఉన్నారు.

"ఒరే దావీదూ నువ్వుట్రా. బొత్తిగా నల్లపూసైపోయావేంట్రా. ఈ మధ్యసలు ఈ పక్కకే రాలేదేంరా!" నిష్ఠూరంగా అన్నారు.

బుర్రగోక్కున్నాడు దావీదు "కర్రోరి మావిడి తోటలో కాపలాకి కుదురుకున్నానండి"

"కొడుకులు అందివచ్చారాయె. చేలో దిగాల్సిన కర్మేంటి నీకూ!" అని ఆగి దావీదు పక్కనున్న యువకుడి వంక చూస్తూ "వీడెవడూ? నీ కొడుకా!" అనడిగారు.

"గబ్బిలంగాడండి ......."

అతడ్ని తేరపారి చూస్తూనే బుగ్గలు నొక్కుకున్నారు. నల్లగా ఉన్నాడు. కండలు తిరిగి ఉన్నాడు. ఒంటిచేత్తో ధాన్యపు బస్తాని అవలీలగా బండికెక్కించేలా ఉన్నాడు.

"సన్నగా బక్కగా ఎలక తోకలా ఉండేవాడు. ఎంతలో ఎంతోడయ్యాడూ!"

"అయ్. అంతా తవరి దయేనండి. పుట్టిన బిడ్డలు పురుట్లోనే పోతన్నారని ఈడికి తవరే గబ్బిలం అని పేరెట్టేరండి. ఈదు బతికి బట్ట కట్టేసేడు......" దావీదు కళ్ళల్లోనే కాదు సర్వాయవాల్లోనూ కృతజ్ఞత ఉట్టిపడుతోంది.

"గబ్బిలమంత వికృతపక్షి ఎక్కడా ఉండదొరేయ్. దానికి నోరూ మలద్వారమూ ఒక్కటే. అలాటి పేరెడితే ఎందుకో బతుకు తాడన్పించింది......."

"పేర్లో ఏవుందమ్మగోరూ, పదిమంది సేత మంచోడన్పించుకుంటే శాన....!"

"కబుర్లు బాగా నేర్చావొరేయ్....." అనింకేదో అనబోయిందల్లా ఆగిపోయింది. దావీదు ఎడంగానే నిలబడ్డాడుగాని గబ్బిలం అరుగుని తాకుతూ నిలబడ్డాడు.

ఆవిడ మొఖంలో కదలాడిన వికృత భావాలు చదివిన వాడల్లా గతుక్కుమని కొడుకుని వెనక్కి లాగేడు దావీదు. కోపంగా చూశాడు కొడుకు.

"పోట్లగిత్తలా ఉన్నాడు. ఏం చేస్తున్నాడేంటి! బడికి పంపించినట్టున్నావ్ నాలుగు అక్షరం ముక్కలన్నా ఒంటబట్టాయా లేదా!"

"వానాకాలం సదువు సదివేడండి. ఏదో ఉజ్జోగం రాకపోదనుకుంటే మాకెవరికీ సెప్పాసెయ్యకుండా మిలట్రీలోకి పోయేడండి......"

ఇంతింత కళ్ళతో చూశారు ఆండాళ్ళమ్మ. "ఎందుకూ పనికి రాని వాళ్ళే మిలట్రీలో కెళ్తారు. ఇంకే దిక్కూ లేనట్టు యుద్ధాలు చెయ్యడానికెళ్ళేవన్నమాట !" కించిత్తు హేళనగా అన్నారు.

"అవసరమైతే చెయ్యాలండి. మన సరిహద్దుల్ని కాపాడుకోవాలి దేశాన్ని రక్షించుకోవాలి....." అన్నాడు గబ్బిలం.

అతడి మాటల్లోని ఆత్మవిశ్వాసానికి అబ్బురపడకుండా ఉండలేకపోయారు.

"పిల్లకాకివి. ఏదో అనుకుంటున్నావుగాని రక్షించేపని నీదీ నాదీ కాదు ఆ పైవాడిది. నారువేసి నీరుపోసి నిన్నింతవాడ్ని చేసింది ఆ పరమాత్ముడే....ఒరే దావీదూ - వీడూ కిరస్తానీమతం తీసుకున్నాడా?"

తప్పుచేసినట్టు తలొంచుకుని తలాడిస్తూ "నలుగుర్తో బాటే........!" అన్నాడు

"హు. మీకింత విశ్వాసం లేకుండా పోయిందేంరా........! సరి సరే. ఎవరెలా పోతే నాకేంగాని నీ చిన్న కొడుకేం చేస్తున్నాడు? వాడ్నైనా పాలేరు పనిలో పెట్టేవా లేదా!"

"ఆడికి సదువచ్చిందండి. తాశిల్దారయ్యాడు....."

పోతపోసిన ఆశ్చర్యమయ్యిందావిడ. నోట్లోంచి మాట ఊడి రాలేదు.

ఒకప్పుడు దావీదు తాము పెట్టిన పాచి అన్నాన్ని ఆబగా తిని పెరిగాడు. తమ గొడ్ల దగ్గరా కమతంలోనూ పని చేశాడు. ఆ దావీదు కొడుకు ఇవాళ అధికారి అయ్యాడు! వేద వేదాంగ పండితుడైన సుబ్బరామశాస్త్రి కొడుకుల్లో ఒకడు తెలుగు పండితుడైతే రెండోవాడు టీవీ మెకానిక్కుగా మారాడు . కాల వైపరీత్యమంటే ఇదేనేమో!

"మొత్తానికి పెట్టి పుట్టేర్రా. సర్కారోడికి మీరంటేనే ప్రేమ. మీకు ఇళ్ళు కట్టిస్తున్నాడు. ఊరికే చదువులు చెప్పిస్తున్నాడు. ఉజ్జోగాలిస్తున్నాడు...నాకు తెలవకడుగుతాసూ మాల మాదిగల పిల్లలంతా చదివేసుకుని ఉజ్జోగాలంటూ ఊళ్ళుపట్టుకుపోతే ఇక ఈ పల్లెల్లో పనీపాటా ఎవరు చేస్తార్రా దావీదూ?"

ఏం చెప్పాలో తోచక తలగోక్కున్నాడు దావీదు.

"ట్రాక్టర్లొచ్చాయి కోత మిషన్లొచ్చాయి...అయినా కడజాతోళ్ళు కడనే ఉండిపోవాలి, ఎప్పటికీ శారీరక శ్రమే చేస్తుండాలి, పెద్దోరికాళ్ళకాడే కుక్కలా పడుండాలి అనడం ఏం న్యాయమండి" కించిత్తు ఉద్రేకపడ్డాడు గబ్బిలం.

"ఏంటేంటీ! గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందనీ నాకే నీతులు చెబుతున్నాడేంట్రా నీ కొడుకూ. నాకే ఎదురు చెప్పేంత వాడయ్యాడా!"

కంగారుపడ్డాడు దావీదు. కొడుకుని కసిరి లెంపలేసుకున్నాడు "తప్పైపోయిందండి. ఊడి మాటలు పట్టించుకోమాకండి. తవఁరి దయా దాచ్చిన్యాలమీద బతికేటోళ్ళం. తవఁరు కళ్ళెర్రజేస్తే మాడి మసైపోతాం......"

శాంతించారు ఆండాళ్ళమ్మ. 'అలా దారికిరా' అన్నట్టు చూశారు. "దారి తప్పి వచ్చారేంటి సంగతి?"

"ఆదివారం ఈడిపెళ్లండి. తవఁరి చేత్తో అంతో ఇంతో ఇస్తే పెళ్లి పనులు మొద లెడతావండి......"

ఆండాళ్ళమ్మ ఎంతో సంబరపడ్డారు.

పాతరోజుల్లో మాలపల్లెలోగాని మాదిగగూడెంలోగాని ఎవరి పెళ్లి అయినా సరే మొదట తమింటికొచ్చేవారు. తాము పదో పరకో ఇచ్చేక పెళ్లి పనులు మొదలెట్టేవారు. పెళ్లయ్యాక పెళ్లి పీటలమీంచి నూతన దంపతుల్ని తిన్నగా తమింటికి తీసుకొచ్చి ఆశీర్వాదం తీసుకునేవారు. ఇద్దరికీ కొత్తబట్టలు పెడితే మురిసిపోయి వేనోళ్ళ పొగడుతూ వెళ్ళేవారు.

ఇప్పుడు కాలం మారిపోయింది.

ఇటు తమ స్థితిగతులూ అటు వారి పరిస్థితులూ ఊహించనంతగా మారిపోయాయి. అడపాదడపా తప్ప ఎవరూ ఆశీర్వాదాలకీ రావట్లేదు!

దావీదు తమ ఉప్పు తిన్నందుకు తమ గౌరవం సంప్రదాయం నిలుపుతున్నాడని సంబరపడ్డారు ఆండాళ్ళమ్మ. ఇంట్లోకెళ్ళి పదినోటు బయటికి తీశారు. మళ్ళీ దాన్ని లోపల పెట్టేసి వంద నోటు తీసుకునొచ్చి ఇచ్చారు.

మహాప్రసాదంలా అందుకున్నాడు దావీదు.

"అమ్మగోరి చెయ్యి పెద్దది. ఆరిసేత్తో ఇత్తేశాన అంతా సక్కగా జరిగిపోద్దారే" అన్నాడు కొడుకుతో.

"థాంక్సండి" అన్నాడు గబ్బిలం.

"జాగ్రత్త. దావీదు ప్రాణాలన్నీ మీమీదే. ప్రాణాల మీదకి తెచ్చుకునే పనులేవీ చెయ్యకుండా బుద్ధిగా నీ బతుకు నువ్వు బతుకు"

తల ఊపాడు గబ్బిలం. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఏదో గుర్తురాగా లోపలికెళ్ళి చిన్న బిందెతో నీళ్ళు తెచ్చి గబ్బిలం తాకిన చోట అరుగుమీద గుమ్మరించారు.

'నాలుగురాళ్ళు సంపాదించేసరికి కళ్లు నెత్తిమీదకొచ్చేస్తాయి. ఎవరేంటో ఎవరి స్థానం ఏంటో మర్చిపోతారు' అనుకుంటూ వెళ్ళి వసారా ముందరి నడవాలో చతికిలబడ్డారు ఆండాళ్ళమ్మ.

ఎందుకో కన్నీళ్ళు ఉరికివచ్చాయి.

సుబ్బరామశాస్త్రి కుటుంబం గ్రామ అగ్రహారంలో అగ్రభాగాన ఉండేది.

లంకంత మండువా లోగిలి. నలుగురు అన్నదమ్ములు. సుమారు వందెకరాల మాగాణి. ఇంట్లోంచి కాలు బయట పెట్టాల్సిన అవసరమే ఉండేది కాదు. పండగొచ్చినా పబ్బమొచ్చినా కథ వచ్చినా కార్యం వచ్చినా కౌలురైతులూ కూలీలూ అంతా వచ్చేవారు. తాము కాలు క్రింద పెట్టక్కర్లేకుండా అన్నీ చక్కబెట్టేవారు. గ్రామపెద్దలు కూడా ఊరుమ్మడి కార్యక్రమాల గురించి స్వయంగా ఇంటికొచ్చి వివరించి సలహాలు తీసుకునేవారు.

ఎంతటి వారొచ్చినా సరే సుబ్బరామశాస్త్రీ, ఆయన భార్య ఆండాళ్ళమ్మా హాల్లోని తూగుడు బల్లమీద ఊగుతూ మాట్లాడేవారు. భుక్తాయాసమూ దాని మీదే తీర్చుకునే వారంటే అతిశయోక్తి కాదు.

గాదెల్నిండా ధాన్యం, ఇంటినిండా కాయగూరలూ, కొబ్బరికాయలూ, అన్ని రకాల పండ్లూ ఉండేవి. ఇహ పాడికి కొదవేలేదు. దోసిలిలో నెయ్యిపోసుకుని జుర్రుకునేవారు.

ఒకరకమైన జమిందారీ పద్ధతిలో సాగేవి రోజులు.

తర్వాత మండువాలోగిలి కాస్తా నాలుగు వాటాలైంది. ఆస్తులూ ముక్కలయ్యాయి. ప్రాభవం తగ్గింది. అయినా ఇంగువ కట్టిన గుడ్డలా ఆ వాసనలు వదల్లేదు.

సుబ్బరామశాస్త్రి ఉన్నంతకాలం ఆండాళ్ళమ్మే చక్రం తిప్పేవారు. రైతుకూలీల్తో చలాయించి మాట్లాడేవారు. ఒక్క గింజ బీరు పోకుండా చూసేవారు. అణాపైసల్తో 'మగతా' వసూలు చేసేవారు.

ఆయన కాలం చేశారు. ఆండాళ్ళమ్మ గుండు చేయించుకుని గదికే పరిమితమైపోవాల్సి వచ్చింది. గృహలక్ష్మి కాస్తా గృహఖైదీ అయిపోయింది.

కొడుకులూ కూతుళ్ళూ ఎదిగి వచ్చారు. పెళ్ళిళ్ళయ్యాయి. సరైనా అజమాయిషీ లేక దుబారా ఖర్చు పెరిగింది. ఆస్తులు హారతికర్పూరమయ్యాయి. ఇక ఇలా లాభంలేదని ఆండాళ్ళమ్మ కొంగు బిగించి అంతా తన చేతుల్లోకి తీసుకున్నారు. పొలాలమ్మి అప్పులకు శ్రీరామ రాయించారు. గుడ్డిలో మెల్లలా చెరువు కింది నాలుగెకరాలు మాత్రం మిగల్చగలిగారు. కొడుకులు ఉద్యోగ వ్యాపారాలంటూ ఊరొదిలి వెళ్ళిపోయారు.

ఆండాళ్ళమ్మ ఒంటిగా ఇంట్లో మిగిలిపోయారు. వచ్చిపోయేవారూ తగ్గిపోయారు. పొలంమీద వచ్చే అయివేజుతో ఒకర్ని దేహి అని అర్థించక్కర్లేకుండా నెట్టుకొస్తున్నారు. దేనికీ వేటికీ తలొంచకుండా అన్నీ తన అభిమతానుసారమే జరిగేట్లు చలాయించుకొస్తున్నారు.

ఇంటాయాన చనిపోగానే తూగుడుబల్ల తాళ్ళు విప్పేసి బల్లని ఇంటి వాసాలకి కట్టేశారు.

అది తన జీవితానికి ప్రతీకలా అన్పిస్తూంటుందావిడికి. దాని వంక దీనంగా చూశారు.

గతాన్ని నెమరేసుకుని గాఢంగా నిట్టూర్చారు.

'గడిచిన కాలమంతా మంచిదే. రేపెలా ఉంటుందో ఏమో. కాలూ చెయ్యీ బాగుండగానే బదరీనాథుడ్నీ కేదారేశ్వరుడ్నీ దర్శించగలిగితే బావుణ్ణు. ఈ జన్మకి ఆ ఒక్క కోరికా తీరితే చాలు ఆపైన ఈ కట్టె ఏమైపోయినా ఫర్లేదు. ఆ దేవదేవుడి అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో !' అనుకుని కళ్ళు మూసుకుని చేతులు జోడించారు.

ఆవిడ ప్రార్థన మన్నించి తన దూతని పంపినట్టుగా వచ్చాడు వాలేశ్వర్రావు. అతడు ప్రక్క ఊరతను. యాత్రా బస్సులు నడుపుతూంటాడు.

"ఆండాళ్ళమ్మగారూ! వాలేశ్వర్రావుని వచ్చేనండి......"

"నువ్వుటయ్యా రారా....... అలా కూర్చో" హాల్లోని చెక్క కుర్చీ చూపించారు.

"మీ ముందు కూర్చోగల అర్హత నాకెక్కడిదండీ. ఏదో మిమ్మల్నీ మిమ్మల్నీ నమ్ముకుని బతికేస్తున్నాను. ఇలా బతకనీండి చాలు. నేనొచ్చిన పాయింటేవిటంటే ఉత్తరదేశయాత్రలకు బస్సువేశాను. మీరీసారి కాదనకుండా రావాల్సిందే"

ఆవిడ కళ్ళు మెరిశాయి. "కేదారనాథ్ కూడా తీసుకెళ్తున్నావా?"

తలాడిస్తూ "కాశీ ప్రయాగ హరిద్వార్ ఋషికేశ్ గంగోత్రి యమునోత్రి కేదారనాథ్ బదరీనాథ్......మీరెప్పట్నుంచో అవన్నీ చూడాలనుకుంటున్నారని తెలిసే అవన్నీ కలిపానండి. అదీ పాయింటు. ఎలాగైనాసరే మీరొచ్చితీరాలి. మీరొస్తే అయిదారు బ్రాహ్మణకుటుంబాల వాళ్ళు వస్తామని గట్టిగా చెప్పేరు" అన్నాడు.

"మా అత్తగారికి బదరీనాథ్ కేదారనాథ్ వెళ్ళాలని మహా కోరిగ్గా ఉండేది. పాపం ఆవిడకి ప్రాప్తం లేకపోయింది. కాశీయాత్ర మాత్రం చెయ్యగలిగారు. చేతిలో డబ్బుండీ మా అమ్మ కాశీ కూడా వెళ్ళలేకపోయింది.......!"

"రేపు మీ గురించి మీ కోడళ్ళూ కూతుళ్ళూ అన్ని యాత్రలూ చేసిన పుణ్యాత్మురాలు - అని గొప్పగా చెప్పుకోవాలి. అంచేత మీరీ యాత్రకి వస్తున్నారు. రసీదు ఎంతకి రాయమంటారు" బ్యాగ్‌లోంచి బిల్లు బుక్కు బయటికి తీస్తూ అన్నాడు.

"నీ తొందర దొంగలు తోల. యాత్ర ఎన్నాళ్ళో ఎంత ఖర్చో తిండీ తిప్పల ఏర్పాట్లేవిటో ఏవీ చెప్పకుండా ఆ కంగారేవిటి! నీ సంగతి తెలిసే వాలేశ్వర్రావని పేరు పెట్టినట్టున్నారు!" నవ్వారు.

"మీరేంటో తెలీకుండా రాలేదండి. మీరు కోరుకునేవన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేశాకే మీ గుమ్మం తొక్కాను. పాయింటు లేకుండా మీ ముందుకి రావడానికి నాకెన్ని గుండెలుండాలి!"

"కబుర్లు నేర్చావు. ఇంతకీ ఖర్చెంత? ప్రయాణం ఎన్ని రోజులు?"

"ఇరవైరోజులు ముప్ఫైవేలు. ఇక్కడ బయల్దేరింది మొదలు మళ్ళీ ఇక్కడికి తిరిగొచ్చేవరకూ తిండీ వసతీ అన్నీ నేనే సమకూరుస్తున్నానండి..."

"ఈ వయస్సులో అన్ని రోజులు ప్రయాణం చెయ్యగలనంటావా!"

"భేషుగ్గా చెయ్యగలరు. నా మీద నమ్మకం ఉంచండి. మీకెలాంటి కష్టం రానివ్వను....."

"భోజనం సంగతేవిటి? అంతా మాలకూడు చేసేస్తావా?"

"అమ్మమ్మ ఎంతమాట. అలాటి వాడ్నైతే మీ ముందు నిలబడగలనా చెప్పండి. వంటా వార్పూ చూట్టానికి ఇద్దరు కోమట్లను తీసుకొస్తున్నాను. మొదట మీలాటివారికి వడ్డించాకే మిగతావాళ్ళకి ఆకు వేస్తాం. ఇంకో పాయింటేవిటంటే ఇక్కడ్నుంచి కాశీ వరకూ రైల్లో తీసుకెళ్తాను. అక్కడ్నుంచి బస్సుమీద తిప్పి మిగతావి చూపిస్తాను. మరో ముఖ్యమైన పాయింటు – మీబోటి పెద్దలు యమునోత్రికీ కేదారనాథ్‌కీ వెళ్ళడానికి డోలీ కాని గుర్రాల్నిగాని ఏర్పాటు చేస్తాను. ఆ ఖర్చూ నాదే. ఏవంటారు? రసీదు కోసెయ్యనా?"

"నాకూ రావాలనే ఉంది. అబ్బాయిలేమంటారో.....!"

"ఏమీ అనరు. ఇన్ని డ్రై ఫ్రూట్స్ మూటకట్టిచ్చి క్షేమంగా వెళ్ళిరమ్మంటారు"

"ఎంతన్నావూ ముప్ఫైవేలా!"

"రెండెకరాల పంట. అంతే సుమండీ"

"మా అబ్బాయిల చెవిలో ఓ ముక్క పడేసి....... రేపు కాదు గాని ఎల్లుండురా......"

"నన్ను చాలా నిరాశ పరిచేస్తున్నారు....."

"వస్తానంటున్నాగా. ఎల్లుండొచ్చి డబ్బు పట్టుకెళ్ళు. ఇప్పుడే చెబుతున్నా. మాకు వేరే ఏర్పాట్లు చెయ్యాలి. వర్ణ సంకరం చేస్తే కాదు"

"ఆ విషయంలో ఎలాంటి తేడా రానివ్వను. వస్తే మీరూరుకుంటారా. ఆడపులిలా మీద పడరూ! మీరొస్తున్నారని చెప్పి నాలుగు టిక్కెట్లు అమ్ముకుంటాను మరి"

"కానియ్. అచ్చంగా మా వాళ్ళే అయితే మరీ మంచిది......."

"కష్టమండి. అంతమంది రారు. ఎల్లుండొచ్చి తమ దర్శనం చేసుకుంటాను. నమస్కారం" అతడెళ్ళిపోయాడు.

ఆండాళ్ళమ్మ మనస్సు ఆనందాన్ని తట్టుకోలేక పిల్లి మొగ్గలేసింది.

ఎన్నేళ్ళకెన్నేళ్ళకి తన కోరిక తీరబోతోంది! ఈ అవకాశాన్ని చచ్చినా జారవిడుచు కోకూడదు.

గబగబా కొడుకులకీ కూతురికీ ఫోన్ చేశారు. ఆనందోద్విగ్నురాలై తడబడుతూ విషయం చెప్పారు. కాని అవతలి వారి జవాబు విని నీరుగారిపోయారు. కళ్ళల్లో కన్నీళ్ళు తిరగ్గా కూలబడిపోయారు.

'మగతోడు లేకుండా ఆడదానివి ఒక్కదానివీ ఎలా వెళ్తావు?' అని ఒకరన్నారు. 'ఈ ముదిమిలో అంతదూరం ప్రయాణం చెయ్యలేవు' అన్నారింకొకరు. 'ఇల్లే వైకుంఠం అనుకుంటూ కృష్ణారామా అనుకో. దేవుడు ఎక్కడలేడు?' అన్నారు మూడోవారు.

తను కన్న సంతానం నుంచి అంత కటువైన మాటలు దూసుకొస్తాయని బొత్తిగా ఊహించలేదేమో బాగా డీలా పడ్డారు.

కళ్ళనుంచి గంగా గోదావరులు ప్రవహిస్తోంటే సర్వం కోల్పోయినదాన్లా అయిపోయారు. అభోజనంగా ఉండిపోయారు. ఒంటిగా ఇంట్లో మ్రగ్గి పోయారు!

*　　　*　　　*

అవాళ తెల్లవారకపోతే బావుణ్ణనుకున్నారు ఆండాళ్ళమ్మ.

కాని సూర్యుడు ఎప్పట్లానే ఉదయించాడు. క్షణక్షణానికీ ఆవిడ గుండెల్లో గుబులు బరువవుతూ ఉలిక్కిపడేలా చేస్తోంది.

ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో వాలేశ్వర్రావు వస్తాడు. ఆశతో వస్తాడు. రాలేనని ఎలా చెప్పడం? ఎలాంటి వంకపెట్టినా కొడుకుల్ని అనుమానిస్తాడు. పేగు తెంచుకుపుట్టిన బిడ్డలకు చెడ్డపేరెలా రానిస్తుంది!

పైగా ఘనత వహించిన సిద్ధాంతం వారి కోడలు. వేదకోవిదులు సుబ్బరామశాస్త్రి గారి ధర్మపత్ని. జీవితపు చరమాంకంలో ఆఖరి కోరిక అనదగ్గ చిరకాల వాంఛని అవకాశం వెదుక్కుంటూ వచ్చినా తీర్చుకోలేకపోవడం...ఇచ్చిన మాట తప్పటం...!

కళవళపడుతూ పూజాదికాలు ఎలా పూర్తి చేశారో ఆవిడకే తెలీదు.

అపరాహ్ణవేళ ఇంటిముందు కారాగింది. భృకుటి ముడివేసి తలుపు చాటునుంచి వీధిలోకి తొంగి చూశారు.

కారులోంచి దావీదూ పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ మరో యువకుడూ దిగుతున్నారు.

దావీదు కొడుకులిద్దరూ సూట్లు ధరించి హుందాగా ఉన్నారు. గతంలో కాలినడకన గొడుగు పట్టుకుని కొత్త దంపతుల్ని తీసుకొచ్చేవారు. అలాటిది...!

తన కళ్ళని విశ్వసించలేకపోయారు.

ఒకప్పుడు మాలలపిల్లలు గోచీలూ, పెద్దిళ్ళ వాళ్ళిచ్చిన చిరిగిన నిక్కర్లూ బనీన్లూ ధరించేవారు. పేడకోసం పశువుల వెంట పరుగులు తీసేవారు. పొలాల్లో పరగ ఏరుకునేవారు. చిన్న పాలేర్లుగా మారి గేదెలు మేపడం చిన్న చిన్న పొలం పనులూ ఇంటిపనులూ చేసేవారు. మెల్లగా కూలీలుగా పాలేర్లుగా ఎదిగేవారు.

అలాటిది మంత్రించినట్టుగా వారి జీవన స్థితిగతులు మారిపోయాయి.

ఇదంతా కేవలం చదువుల వల్ల వచ్చిన మార్పేనా?

అవుననుకో లేకపోయారు. అలా అని వాస్తవాన్ని జీర్ణించుకోలేకుండానూ ఉన్నారు. మనస్సు చేదుగా అయిపోగా మొఖానికి చిరునవ్వు పులుముకుని వీథి అరుగుమీదకెళ్ళారు.

"అరె పెళ్లి పీటల మీంచి తిన్నగా తీసుకొచ్చేవా. మేవంటే నీకెంత పిచ్చి అభిమానంరా దావీదూ. ఈ ముక్కముందే చెప్పివుంటే కొత్త బట్టలు తెప్పించి పెడుదును గదా...!"

"తవఁరి సల్లని దీవెన సాలు అమ్మగోరూ..."

ఆ మాటల్లో వినయం కన్నా 'మాకేం తక్కువ?' అన్న గర్వం కన్పించింది. మొఖాన గంటుపెట్టుకుని లోపలికెళ్ళి రెండొందలు తెచ్చారు.

తండ్రి సైగ చేయగా దోసిలి పట్టాడు గబ్బిలం. అంతెత్తు నుంచి నోట్లు దోసిట్లో పడేలా వేశారు.

"కొత్త కోడలికి చీర కొని పెట్టరా"

గబ్బిలమూ అతడి భార్యా ఎడంగా నిలబడే దణ్ణం పెట్టుకున్నారు.

తలాడించి రెండో యువకుడ్ని ముందుకి తోసి "నా చిన్న కొడుకండి..." అని చెప్పేడు దావీదు.

"చాలా సంతోషం. ఆర్థిక స్తోమతు సాంఘిక ప్రోత్సాహం కరువైనా ప్రతి చిన్న అవకాశాన్నీ అందిపుచ్చుకుని వృద్ధిలోకొచ్చారు..." అన్నారు అయిష్టంగానే.

పొంగిపోయాడు దావీదు.

"ఉత్తరదేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ చూపిస్తాను రమ్మంటుంటే మా నాయన రానంటున్నాడండి. మీరో ముక్క చెబితే.... మీ మాటంటే మా నాయనకి వేదవాక్కేనండి" గబ్బిలం అన్నాడు.

"అవన్నీ మా దేవుళ్ళవి కదా!" గబుక్కున అనేశారు.

చిన్నగా నవ్వేడు దావీదు చిన్నకొడుకు "మా నాయనకి అందరి దేవుళ్ళూ ఇష్టమే "

"ఈ గబ్బిలం కైలాసయానం చేయిస్తుందన్నమాట! చిత్రాల కాలమైపోయింది! తీసుకెళ్ళి చూపిస్తానంటే నీకేం దొబ్బుడాయిరా. వెళ్ళు..." పెదవుల మీంచి వచ్చాయి. గుండెలు మాత్రం అసూయతో భగభగమండసాగాయి.

పరమానందపడిపోయాడు దావీదు. వంగి నమస్కరించాడు. వాళ్ళటు వెళ్ళగానే ఇట్నుంచి వాలేశ్వరావు వచ్చాడు.

"నమస్కారం ఆండాళ్ళమ్మగారూ..."

పర మతస్తుడైన దావీదు వెళ్తున్నప్పుడు తను వెళ్ళలేదా! తనకా మాత్రం స్వేచ్ఛ లేదా? అదీగాక దావీదుకన్నా తన అదృష్టం తక్కువది కాదుగాక కాదంతే!

"ఇప్పుడెంతిమ్మంటావూ..."

"మీ సొమ్మెక్కడకి పోద్దండీ. ఇనప్పెట్టెలో పెట్టుకున్నట్టే. ఒక్క రూపాయి ఇచ్చినా చాలు... మీరొస్తున్నారని టాంటాం వేశాను. బ్రాహ్మల టిక్కెట్లో పది తెగాయి..." సంబరంగా చెప్పాడు.

నాల్రోజుల క్రితం రైతు తెచ్చిచ్చిన పంట సొమ్ములోంచో అయిదువేలు తీసిచ్చింది.

"మీరొస్తున్నారంటే సాక్షాత్తూ ఆ కాశీ అన్నపూర్ణ వస్తున్నట్టే ఉంది" అన్నాడు రసీదిస్తూ.

మరి నాల్రోజులు తిరక్కుండానే కొడుకులూ కూతుళ్ళూ కట్టకట్టుకునొచ్చేశారు.

"మేం వెళ్ళొద్దన్నాంగా అంత మంకు పట్టుదలేంటి?" అని కోప్పడ్డారు.

"శివుడాజ్ఞ అయ్యింది మరి..." మందహాసం చేసింది.

మిర్రి చూశారు. ఆవిడ ఒకరి మాట వినేరకం కాదని తెలుసు.

"నీకు తెలీందేవుందమ్మా. కాశీకి వెళ్ళినవాళ్ళూ కాటికి వెళ్లిన వాళ్ళూ ఒకటేనంటారు. ఎందుకైనా మంచిది నీ పేరనున్న నాలుగెకరాల్నీ మాకు రాసిస్తూ వీలునామా రాసెయ్"

పెద్ద కొడుకు మాటలకు తుళ్ళిపడింది. అపనమ్మకంగా చూసింది. క్షణకాలం దావీదు కొడుకుల్తో వీళ్ళని పోల్చి చూసింది మనస్సు.

కులమతాలకీ బుద్ధులకీ సంబంధం లేనే లేదా?

గాఢంగా నిట్టూర్చి అంది "ఎలాగూ అంతా మీదే కదరా. ఇప్పుడా రాతకోతలెందుకూ!"

"మళ్ళీ రేపు తేడా పాడాలు రాకుండానూ!" దీర్ఘం తీసింది కూతురు.

"నేను తిరిగి రాననుకుంటున్నారా?"

సూటిగా అడిగేసరికి తబ్బిబ్బు పడ్డారు.

"చేతిలో ఉన్నది కాస్తా మీకిచ్చేస్తే తిరిగొచ్చేక నిన్ను నిన్నూ దేబిరిస్తూ బతకాల్సిందే గదా!"

"అదేం మాటమ్మా. మోక్షం లభించాలని బదరీనాథ్ వెళ్తూ ఆస్తిపాస్తుల మీద ఈ కాపేణాలేంటి?" సఱ్ఱున లేచి కోపంగా అన్నాడు చిన్న కొడుకు.

'భగవంతుడా! ఏవిటీ పరీక్ష?' అని వాపోయారు.

ఆమె మౌనాన్ని రకరకాలుగా ఊహించుకున్నారు. తోక తొక్కిన త్రాచుల్లై బుసలు కొట్టి మరీ వెళ్ళిపోయారు.

* * *

కాశీలో గంగానదిలో మునిగి లేచి పులకించిపోయారు ఆండాళ్ళమ్మ.

'తెలియక నేనేమైనా పాపాలు చేసి ఉంటే వాటన్నిటీన్నీ ప్రక్షాళనం చెయ్యి గంగమ్మ తల్లీ' అని ప్రార్థించారు.

విశ్వనాథుడ్ని తనివి తీరా దర్శించి పొంగిపోయారు.

బస్సు మాట్లాడి తీసుకొచ్చాడు వాలేశ్వర్రావు. ఆండాళ్ళమ్మా తదితరులకు ప్రత్యేకంగా ముందు సీట్లు కేటాయించాడు.

డ్రైవర్ సీట్లో కూర్చునున్న సర్దార్జీని చూసి నుదురు చిట్లించారు ఆండాళ్ళమ్మ.

"ఆ గెడ్డపోడ్ని పెట్టేవేంటి. అతడిది వేరే మతం కదా. అతగాడి కులం పెద్దదో చిన్నదో తెలీదాయె. నీకింతకంటే మంచివాళ్ళెవరూ దొరకలేదా?" అని నిలదీశారు.

"హరిద్వార్ దాటేక ప్రయాణమంతా ఘాట్ రోడ్ మీదేనండి. కొండల అంచుల మీంచి వెళ్ళాలి. కొండల్ని తొలిచి వేసిన రోడ్డు సన్నగా ఇరుగ్గా ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా నడిపినా బస్సు లోయలో పడిపోతుంది. వీళ్ళకీ రూట్లన్నీ కొట్టిన పిండి. ఎలాంటి ప్రమాదమూ రానీకుండా చాకచక్యంగా నడుపుతాడు. మనల్ని క్షేమంగా గమ్యాన్ని చేర్చేవాడు కావాలిగాని అతడి కులగోత్రాలతో మనకేం పని చెప్పండి..."

బుగ్గలు నొక్కుకుని కొత్త వ్యక్తిని చూసినట్టు చూసింది.

"ఇంకో సంగతి చెప్పనాండీ. కష్టపడి పని చేయడంలో ఈ సర్దార్జీలు ఫస్టు. వాళ్ళలో అడుక్కొనేవాళ్ళు ఒక్కరంటే ఒక్కరు ఉండరంటే నమ్మండి"

అబ్బురపడింది. సర్దార్జీ వంక గౌరవపూర్వకంగా చూసింది.

'ఇలాంటి కొత్త సంగతులు తెలుసుకోడానికే పూర్వులు తీర్థయాత్రలు చెయ్యమన్నారేమో!' అనుకోకుండా ఉండలేకపోయారు.

హరిద్వార్, ఋషికేష్, యమునోత్రి – ఒక్కో క్షేత్రం చూస్తూ స్నానమాచరిస్తూ జన్మ ధన్యమైనట్టు పొంగిపోయారు ఆండాళ్ళమ్మ.

అదే సమయంలో బస్సులోని సగం మందితో కలవలేకపోతున్నారావిడ. వాలేశ్వర్రావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాసరే అంటూ సొంటూ అంటూ గొణుగుతూనే ఉన్నారు. మిగతా వారిని తక్కువ చేసి మాట్లాడుతున్నారు. 'దూరం దూరం' అంటూ హీనంగా చూస్తున్నారు!

ఆమె ధోరణికి విసిగిపోయి మధ్య మధ్యలో "నలుగుర్తో నారాయణ అంటూ సర్దుకుపోవాలి" అని సన్నగా విసుక్కుంటున్నాడు వాలేశ్వర్రావు. అంటరానితనం శిక్షార్హం అంటూ సన్నాయి నొక్కులూ నొక్కాడు.

కేదారనాథ్ వెళ్ళడానికి గుర్రపు సవారీ ఏర్పాటు చేశాడు.

"పెద్దదాన్ని. దానిమీద నేనెలా కూర్చోగలను?" కయ్‌మన్నారు ఆండాళ్ళమ్మ.

"రాత్రి బాగా వర్షం కురిసిందట. వాతావరణమూ బాగోలేదు. గుర్రాల మీద వెళ్తేనే మంచిదండి...మీకేం ఇబ్బంది ఉండదు. గుర్రం మీద జీను ఉంది . పైగా ఈ కొండల్లో తిరిగే గుర్రాలు గనుక చకచకా తీసుకెళ్తాయి..."

"ఇతగాడి మొహం ఏదోలా వుంది. ఏ జాతి వాడో!" సందేహిస్తూ అన్నారు.

"నేపాలీవాడు. మంచోడే. మీరేం వెనకాడొద్దు..."

అయిష్టంగానే గుర్రమెక్కారు. "జాగ్రత్తగా తీసుకెళ్ళు. అర్థమైందా?" అన్నారతడ్తో. అతడు అయోమయంగా చూస్తూ మందహాసం చేశాడు. "ఏం మాట్లాడినా తేభ్యం మొహం వేసుకుని చూస్తున్నాడు. వీడికి తెలుగు రాదనుకుంట ఖర్మ! జాగ్రత్తగా తీసుకెళ్ళమని చెప్పు. అగ్రహారపు మనిషినని కాస్త అర్థమయ్యేలా చెప్పు గౌరవంగా మసలుకుంటాడు"

హిందీలో గుర్రపు ఆసామీకి జాగ్రత్తలు చెప్పేడు వాలేశ్వర్రావు.

తన బస్సువాళ్ళందర్నీ జట్లు జట్లుగా పంపించాడు. మధ్యలో ఉన్నారు ఆండాళ్ళమ్మ.

అధిరోహణ మొదలైంది.

కేదారేశ్వరుడ్ని దర్శించబోతున్నందుకెంతో ఉద్విగ్నంగా ఉంది. మహాశివుడు తిరుగాడే మంచుకొండలివే ఇవే - అని మురిసిపోతూ ఆనందపరవశులయ్యారు. అత్యద్భుత హిమాలయ పర్వతశ్రేణుల్లోని కొండా చెట్టూ పుట్టా సెలయేరు నదీపాయ ఇంతింత కళ్ళతో వీక్షించసాగారు.

సగం దూరమెళ్ళారో లేదో సన్నగా వర్షం మొదలయ్యింది.

"దేవతలు ఆశీర్వదిస్తూ పూలవాన కురిపిస్తున్నారు....." పరమానందంగా అన్నారు.

అతడు మాట్లాడలేదు. ఆకాశం వంక చూసి గొణుక్కున్నాడు.

మరి కాస్త దూరం వెళ్ళేసరికి వర్షం పెరిగింది. ఆండాళ్ళమ్మ నిలువునా తడిసి పోతున్నారు. కప్పుకున్న టార్పాలిన్ కవర్ రక్షణ ఇవ్వలేకపోతోంది. ఆమె వణకిపోతూండటం గమనించి తను ధరించిన రెయిన్‌కోటు తీసి ఆమెకిచ్చాడు.

తటపటాయించింది. వానజోరు హెచ్చింది. గాలి శివాలెత్తి నట్టుగా వీస్తోంది. చలిజ్వరం వస్తుందేమోనని భయమేసింది.

ఇలాటివి వెంట తెచ్చుకోమని ముందుగా చెప్పనందుకు వాలేశ్వర్రావుని తిట్టుకుంటూ ఎవరూ తనని గమనించడం లేదని నిర్ధారణ చేసుకున్నాక దాన్ని ధరించారు.

మరి కొద్దినిమిషాలకే వర్షోధృతి విపరీతంగా పెరిగిపోయింది. ముందుకెళ్ళడానికి గుర్రం మొరాయిస్తోంది.

"గట్టిగా పట్టుకో పడిపోతాను..." భయవిహ్వలయై అరిచారు.

"డరోమత్ మాతాజీ" అని భరోసా ఇచ్చాడు. అతడి మాటలు అర్థంగాకపోయినా భావం అర్థమైంది. ధైర్యం కూడదీసుకుంది.

మెల్లగా గుర్రాన్ని స్లోప్ కిందికి తీసుకెళ్ళాడు. వర్షం ఈడ్చికొడుతోంది. గుర్రం అక్కడక్కడే కల తిరగసాగింది. గుర్రం దిగమని సైగల్తో చెప్పేడు. ఆవిడ దిగనంటూ భీష్మించింది.

"దగ్గరకి రాకు.....ముట్టుకోకు......" అన్నారు బిగ్గరగా.

ఆమె ప్రతిఘటనని లెక్కచెయ్యకుండా బలవంతాన ఆమెని ఎత్తి దింపి చెట్టు పొదల క్రిందికి తీసుకెళ్ళాడు. భయంతో కేకలు పెట్టారు. ఆవిడ్ని దింపి అతడు దూరంగా వెళ్ళాకే స్థిమితపడ్డారు. తన బ్యాగ్ గుర్రం మీద వుండిపోయిందని గుర్తొచ్చి అరిచి చెప్పారు. అతడు దాన్ని తెచ్చిచ్చాడు. దాన్ని గట్టిగా పట్టుకున్నారు. అందులో చీరలూ పూజాసామాగ్రి వగైరాలున్నాయి. డబ్బు లంగాకి కుట్టిన చిన్ని సంచిలో భద్రంగా ఉంది. అయినా కొట్టి లాక్కుని పారిపోతాడేమోనని అతడి వంక అనుమానంగా చూస్తూ ముడుచుకు పోయారు. తన బస్సువాళ్ళెవరైనా కన్పిస్తారేమోనని చూశారు గాని కంటికసలేమీ కన్పించటం లేదు!

ఉరుములు మెరుపులతో హోరున కురుస్తోంది వాన. ఆకాశం వంక చూసి పెదవి విరిచాడు.

'ఇంక పైకెళ్ళలేం' అనుకుంటూ తల అడ్డంగా ఊపుతూ సైగ చేశాడతడు.

ఇంతలో అలకనంద జడలు విప్పుకుని ఉప్పొంగింది. ఎక్కడికక్కడ నీటి పాయలు పోటెత్తుతున్నాయి. ఊహించని విధంగా పైనుంచి బురద వరదలా వచ్చి పడింది. దానిలో కొందరు కొట్టుకుపోతూండటం కంటబడింది. ఇద్దరి గుండెలూ గుభిల్లుమన్నాయి.

గుర్రం సకిలిస్తూ ముందుకాళ్ళెత్తి అతడ్ని త్రోసేసి వేగంగా క్రిందివైపు ఉరికింది. నడక మార్గం కొట్టుకుపోతూండటం గమనించి 'జాగ్రత్త' అని ఆవిడ్ని హెచ్చరించి అతడూ వేగంగా వెళ్ళిపోయాడు.

ఊహించని పరిణామానికి బిత్తరపోయారు ఆండాళ్ళమ్మ. కన్నీళ్ళు పొంగివచ్చాయి. 'దేవుడా దేవుడా' అని విలపించారు.

గాలీ వానా ఉధృతమయ్యాయి. బీభత్స నృత్యం చెయ్యసాగాయి. అంత పెద్ద కొండలూ కదిలిపోతున్నాయి. ఎక్కడికక్కడ కొండ చరియలు విరిగిపడుతున్నాయి. ఆవిడ గుండెలు జారిపోయాయి.

చీకటిపడింది. వర్షమింకా ఏనుగుతొండాలతో కుమ్మరిస్తున్నట్టు కురుస్తూనే వుంది. చలి గడ్డకట్టిస్తోంది. కడుపులో పేగులు ఆకలితో అరుస్తున్నాయి. 'ఏ జన్మలో ఏ పాపం చేశానని నాకిలాటి శిక్షవేశావు దేవదేవా' అంటూ విలపించసాగారు ఆండాళ్ళమ్మ.

ఏడుస్తూ గొణుక్కుంటూ ప్రార్థిస్తూ జోగుతూండిపోయారు. ఎట్టకేలకు తెల్లవారింది. కాని వర్షం తగ్గలేదు. భీకర గాలులు శాంతించలేదు. ఎటు చూసినా ప్రళయ కాల ఘోషలే! గర్జనలే!

ఆకలికి తట్టుకోలేకుండా ఉన్నారు ఆండాళ్ళమ్మ. శోష వచ్చేట్టుంది. "ఎవరైనా పట్టెడన్నం పెట్టి పుణ్యం కట్టుకోండి" అని బిగ్గరగా అరిచారు. ఆవిడ మాటలు కొండల్లో ప్రతి ధ్వనించాయి.

వెక్కి వెక్కి ఏడుస్తోంటే కొండపై నుంచో ముగ్గురు యువకులు జారిపడుతూ లేస్తూ క్రిందికెళ్తూ కన్పించారు. అరుస్తూ వారిని పిలిచారు. పొట్ట చూపించి అర్థించారు. ఒకడు తన బ్యాగ్‌లోని రోటీని ఆమె మీదకి విసిరేడు.

అట్టలా ఉందది. అయినా అదే మహా ప్రసాదం అనుకుని ఆవురావురుమని తినేశారు.

వారిదే కులమో మరే మతమో అని తర్కించుకోలేదు.

వర్షం భారీగా కురవడంతో వాగులూ వంకలూ పొంగాయి. ఉప్పొంగిన గంగ పెనుగంగై శివమెత్తింది.

నీటి ప్రవాహం ఆండాళ్ళమ్మనీ త్రోసేసింది. క్రిందకు ఇంకా క్రిందకు జారిపోయారు. మధ్యలో ఓ చెట్టు అడ్డు తగలగా దాన్ని వాటేసుకున్నారు. లేకపోతే లోయలోకి కొట్టుకుపోయేవారే. గుండెలు కుదుట పడ్డాక జాగ్రత్తగా చెట్టుకొమ్మ ఎక్కి ముడుచ 
ుక్కూర్చున్నారు. కళ్లు మూసుకుని రామనామం జపించసాగారు.

'నేనిక్కడే ఈ హిమాలయాల్లోనే సమాధి అయిపోవడం ఖాయం. ఇందుకోసమేనా ఇంతదూరం తీసుకొచ్చావు? కేదారనాథ్ చేరకుండా నీ దర్శనం లభించకుండా చేసింది ఇందుకోసమేనా?!' అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

కొడుకులూ కూతుళ్ళూ మనవలూ గుర్తొచ్చారు. దు:ఖం రెట్టింపయ్యింది.

మన్నూ మిన్నూ కలిసిపోతూ అంతా అతికినట్టుగా అయిపోతోంటే మనిషనేవాడు కానరాక అల్లల్లాడుతూండిపోయారు.

ఆకాశాన్ని చీలుస్తోన్న మెరుపు తీగల్ని చూసి 'నా గోడు ఆ విశ్వనాథుడికి విన్పించు. ఆదుకోమని చెప్పు' అని బేలగా అర్థించారు.

మరి రెండ్రోజులు గడిచాయి.

నిస్త్రాణగా కొమ్మని కావలించుకుని నిమిషాలు లెక్కపెడుతూ ఉండిపోయారు ఆండాళ్ళమ్మ.

ప్రకృతి విశ్వరూపాన్ని ప్రత్యక్షంగా చూశాక తనది అగ్రకులం, తామెంతో అధికులం అని విర్రవీగే ఆవిడ అహంకారం పటాపంచలయ్యింది. మనిషి కేవలం పిపీలికం తామెంతో అధికులు అని పదే పదే అనుకుంటూ లెంపలేసుకున్నారు.

ఎట్టకేలకు వర్షం తగ్గింది. కాని నిలువెత్తు కొండ మీంచి రాళ్ళు దొర్లుకుంటూ వచ్చి పడుతున్నాయి. వాటి క్రింద పడి నలిగిపోయారో ఏమో దూరాన్నుంచి అరుపులు విన్పించసాగాయి. మరింతగా బిగుసుకుపోయారు ఆండాళ్ళమ్మ. కన్నీళ్ళు చెంపల మీంచి ధారలు కడుతున్నాయి !

ధైర్యాన్ని కూడదీసుకుని అతి కష్టంమీద తల తిప్పి చుట్టూ చూశారు.

ఎక్కడ్నుంచి కొట్టుకొచ్చాయోగాని చుట్టూ శవాల గుట్టలు!

భయంతో అరిచారు. కాని చిత్రం నోట్లోంచి ఎలాంటి శబ్దమూ బయటికి రాలేదు!

నిస్తేజంగా చూశారు. నిర్వికారంగా చూశారు. ప్రాణం మీది తీపి పోయింది. వైరాగ్యం ఆవరించింది. 'నా నుదుట కటిక చావు రాసి పెట్టి ఉంది కాబోలు. కానియ్' అన్న తెగింపు వచ్చేసింది.

ఇంతలో ఏదో కలకలం విన్పించింది. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశారు. ఆశగా ఆరాటంగా కలయజూశారు.

పైన హెలికాప్టర్లు తిరుగుతున్నాయి. మిలటరీ జవాన్లు యాత్రికుల్ని గాలిస్తూ నలువైపుల్నుంచీ కొండ ఎక్కి వస్తున్నారు.

ఆశ తళుక్కున మెరిసింది. శక్తినంతా కూడదీసుకుని అరిచారు. రాళ్ళు విసిరారు. ఒక జవాను ఆమె దగ్గరకు దూసుకొచ్చాడు. కైలాసగిరి నుంచి ఆ శివుడే దిగి వచ్చినట్టన్పించింది. చేతులు జోడించారు. భుజం తట్టి భరోసా ఇచ్చాడు. తన దగ్గరున్న బిస్కెట్లు ఇచ్చాడు. ఆకలి తప్ప అంటూ సొంటూ కన్పించలేదు. ఆబగా తినేశారు.

ఆమెని వీపు మీదికెక్కించుకుని గబగబా క్రిందికి దిగసాగాడు. ఇంతలో అతడి కాళ్ళ క్రింది కొండ చరియ ఫెళఫెళమని విరిగి పడింది. పరిస్థితి గ్రహించి ఆమెని మరోప్రక్కకి విసిరేశాడు. మరుక్షణం అతడు లోయలోకి జారి పోయాడు.

అతడి ఆర్తనాదానికి కదిలిపోయి 'ఇదేం అన్యాయం దేవుడా!' అని ఏడ్చేశారు.

ఆమె క్రిందికి దొర్లుకుపోయి ఒక బండకి కొట్టుకుని ఆగారు. ఆండాళ్ళమ్మ అదృష్టం. ఆమె పడినవైపు కొందరు జవాన్లున్నారు. వారు గబగబా ముందు కొచ్చారు. లేపదీశారు. వాళ్ళలో వాళ్ళు ఏదో చెప్పుకున్నారు.

ఒకడామె చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా ఆవలి తీరానికి తీసుకెళ్ళాడు. చుట్టూ ఆశ్చర్యంగా అపనమ్మకంగా చూసి పిమ్మట అతడ్ని చూశారు. ఆ కేశవుడే అన్పించాడు. అప్రయత్నంగా చేతులు జోడించారు.

ఆమె మనస్సు ఆనందసంద్రమయ్యింది. పెదాల మీద అపురూప నగవు కదిలింది.

అన్ని వైపుల్నుంచీ ఆడా మగా పిల్లా పాపల్ని మరిందరు సిపాయిలు తీసుకొస్తున్నారు.

భార్యల్ని పోగొట్టుకున్న అభాగ్య భర్తలు, భర్తల అతీగతీ తెలీని భార్యలు, కన్నపిల్లలు ప్రవాహంలో కొట్టుకుపోగా నిస్సహాయంగా విలపిస్తోన్న తల్లిదండ్రులు, తల్లిదండ్రుల జాడ తెలీని సంతానం, సహచరుల ఆచూకీ అణుమాత్రం తెలీని యాత్రీకులు..... ఎందరెందరో వివిధ భాషల్లో యాసల్లో బిగ్గరగా అరుస్తూ ప్రాణాలరచేత బట్టుకుని బిక్కుబిక్కుమని చూస్తూ వెక్కిళ్ళు పడుతున్నారు. కొందరు బిగ్గరగా ఏడుస్తున్నారు.

సైనిక జవానులు ప్రకృతి విలయానికి ఎదురొడ్డి సాహసిస్తున్నారు. ఉత్పాతపు బారినపడి ఊపిరాడకుండా ఉన్న దీనజనానికి కొండంత అండగా బాసటగా నిలబడి చేయూతనిస్తున్నారు. తమ ప్రాణాల్ని సైతం ఫణంగా పెడుతున్నారు.

ఒక పద్ధతి ప్రకారం చకచకా సహాయపడుతున్న వారిని చూసి అద్భుతరసానంద స్థితిలో ఉండిపోయింది ఆండాళ్ళమ్మ. బహుశా భగవంతుడు ప్రత్యక్షమైతే అచ్చం ఇలాటి అనుభూతే కలిగేదేమో అనుకోకుండా ఉండలేకపోతున్నారు.

కర్రల వంతెన సగం కొట్టుకుపోగా బాగుచెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు జవాన్లు.

కమాండర్ ఆదేశమివ్వగా కొందరు జవాన్లు కొంతభాగం కొట్టుకుపోయిన వంతెనమీద అడ్డంగా పడుకున్నారు. ఆ 'మానవ వంతెన' మీంచి నడిచెళ్ళమన్నారు.

మనిషి మీద కాలేసి నడపడం...తప్పదు. బాధగా సంకోచంగా చూస్తూనే వారిమీంచి నడిచెళ్ళారంతా. ఆండాళ్ళమ్మ అవతలి ఒడ్డుకువెళ్ళి వెనుదిరిగి చూశారు. వారంతా వివిధ రూపాల్లోని దేవుళ్ళలా దర్శనమిచ్చారు!

కేదారేశ్వరుడి దర్శనం కాలేదన్న దిగులు పటాపంచలయ్యింది. ఉత్సాహంగా మిగతాయాత్రికుల్తో కలిసి అడుగు వేశారు. ఒక వాగు అడ్డొచ్చేసరికి ఆగిపోయారంతా. పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది నది. అందులో కొందరు కొట్టుకుపోతూండటం చూసి భయంతో కళ్ళు మూసుకున్నారు. 'జలసమాధి' అవడం ఖాయమనుకున్నారు. అవతల్నుంచి జవాన్లు పెద్ద తాడు విసిరారు. దాన్ని ఇవతలి వైపునున్న మరో జవాను అందుకుని గట్టిగా పట్టుకుని నిలబడ్డాడు. ఆ తాడుని పట్టుకుని వాగు దాటుకున్నారు.

అందర్తోబాటు అందర్తో కలిసి తాడుని గట్టిగా పట్టుకున్నారు ఆండాళ్ళమ్మ. మెల్ల మెల్లగా అడుగులేస్తూ దాటుతున్నారు. ఇంతలో ఒక్క పెట్టున మహోత్తుంగ జలప్రవాహం విరుచుకుపడింది. హాహాకారాలు చేశారంతా. కొందర్తో బాటు ఆండాళ్ళమ్మా కొట్టుకుపోయారు. ప్రాణం మీద ఆశ వదిలేసుకున్నారు. కడసారి ప్రార్థన చేసుకోసాగారు. కానింతలో ఓ జవాను ఉరికి వచ్చి ఆవిడ జుట్టు పట్టుకుని ఒక ప్రక్కకి లాగాడు. సాక్షాత్తు బదరీనారాయణుడే దిగి వచ్చి చేయి అందించిన అనుభూతి కలిగింది. భరోసా చిక్కింది. ఆవిడ్ని భుజానికెత్తుకుని ఒడ్డుకుచేర్చాడు.

"మీకేం కాలేదు.భయపడకండి.అదిగో ఆ ప్రక్కనే హెలికాప్టర్ ఉంది. ........."

భయంకరమైన ఆ అనుభవపు షాక్‌లోంచి పూర్తిగా కోలుకోని ఆమెకి తెలుగు మాట - పరిచిత స్వరం విన్పించేసరికి గబుక్కున కళ్ళు తెరచి చూశారు ఆండాళ్ళమ్మ.

ఎదురుగా గబ్బిలం !

అతడూ ఆమెని గుర్తుపట్టి " మీరా అమ్మగారూ" అన్నాడు. సృష్టిలోని ఆశ్చర్యమంతా అతడి గొంతులోనే ఉంది!

చిద్విలాసంగా నవ్వేరు.

కన్నతల్లిలా అతడ్ని ఆప్యాయంగా వాటేసుకుని కొత్త సత్యమేదో కనుగొన్నట్టు ఆనందోద్విగ్నయై ఊగిపోతూ అన్నారు.

"నువ్వు కాదురా అసలుశిసలు గబ్బిలాన్ని తల్ల క్రిందులుగా వేలాడుతున్న వికృత పక్షిని నేనే. ఇన్నేళ్ళూ మానవుడిలో మాధవుడ్ని చూడలేక అజ్ఞానాంధకారంలో అలమటిస్తోన్న గబ్బిలాన్ని నేనే! నేనే!!"

(జాషువా పరిశోధనా కేంద్రం వెలువరించిన కథా సంకలనంలో ప్రచురితం-2014)